
సాక్షి కర్నూలు

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



శివయ్యా.. దారేది?

శ్రీశైలంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు పాదయాత్రగా వెళ్లనున్నారు. అయితే ఇప్పటి వరకు నడక దారిలో జంగిల్ క్లియరెన్స్ చేయలేదు. 8లో▸



అహోబిలేశుడికి నీరాజనం

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకీ గురువారం జి.జమ్ములదిన్నె గ్రామంలో కొలువుదీరింది. గ్రామస్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,613.33
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 43.575
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 6,687

న్యూస్‌రీల్

విజయ పాల ధర పెంపు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మిల్క్ యూనియన్ విజయ పాల ధరలను పెంచింది. పెంచిన పాల ధరలు ఈ నెల 16 నుంచి అమలులోకి వస్తాయని కర్నూలు డెయిరీ అధికారులు ప్రకటించారు. పాలతో పాటు పెరుగు ధరలను కూడా పెంచింది. విజయ గోల్డ్ (హోమోజినైజ్డ్) లీటరు ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ.68 ఉండగా... రూ.70కి పెంచారు. విజయ గోల్డ్(పాశ్చురైజ్డ్/హోమోజినైజ్డ్) 500 ఎంఎల్ ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ.35 ఉండగా... రూ.36కు పెంచారు. టోన్డ్ మిల్క్ 500 ఎంఎల్ ప్యాకెట్ ధర రూ.28 నుంచి రూ.29కి, పెరుగు 450 గ్రాములు ధర రూ.34 నుంచి 35కు పెంచారు.

1.76 టీఎంసీలు నీరు ఇవ్వాలని ఇండెంట్

కర్నూలు సిటీ: తుంగభద్ర జలాశయం నుంచి కేసీ కెనాల్ కోటాగా కేటాయించిన నీటిని విడుదల చేయాలని కోరుతూ జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి నుంచి సీఈ కబీర్ బాషా ద్వారా ఈఎన్‌సీకి ఇండెంట్ పెట్టారు. ఈ ఏడాది తుంగభద్ర జలాశయంలోకి వచ్చిన నీటి చేరికలను అనుసరించి కేసీకి 9 టీఎంసీల నీటిని కేటాయించారు. అక్టోబరు నెలలోపు కేసీ కెనాల్ వాటా నీటికి ఇండెంట్ పెట్టకపోవడంతో ఒక టీఎంసీ నీరును పక్క జిల్లాకు మళ్లించారు. ఆ తరువాత మరి కొంత నీటిని సైతం మళ్లించారు. గత నెలలో ఇండెంట్ పెట్టి మూడు టీఎంసీల నీటిని టీబీ డ్యాం నుంచి నీటిని వినియోగించారు. ఇంకా మిగిలిన నీటి నుంచి ఈ నెల 15వ తేదీ నుంచి నెలాఖరు వరకు రోజుకు 2 వేల క్యూసెక్కుల చొప్పున 1.76 టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఇంజినీర్లు కోరారు.

ఉపాధి పనుల్లో కూలీల హాజరు పెంచండి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టి రోజుకు లక్ష మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య ఏపీవో, ఏపీడీలను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో లేబర్ రిపోర్టు, పశువుల షెడ్ల నిర్మాణాలు తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజుకు 62 వేల మంది వరకు మాత్రమే ఉపాధి పనుల్లో లేబర్ రిపోర్టింగ్ ఉందని, ఈ నెల 17 నుంచి లక్షకు పెంచాలని సూచించారు. ఆస్పరి, ఆదోని, వెల్దుర్తి, మంత్రాలయం, కోసిగి, ఆలూరు, నందవరం, పెద్దకడుబూరు తదితర మండలాల్లో లేబర్ రిపోర్టింగ్ తక్కువగా ఉందని పేర్కొన్నారు. పశ్చిమ ప్రాంతంలో ఉపాధి పనులు పెద్ద ఎత్తున కల్పించి వలసలు పూర్తిగా నియంత్రించాలన్నారు. జిల్లాకు పశువుల షెడ్లు 952 మంజూరయ్యాయని, ఇందులో ఇప్పటి వరకు 526 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు పీడీ మాధవీలత, ఫైనాన్స్ మేనేజర్ అదెయ్య, డ్వామా పరిపాలన అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 19 నుంచి ఆర్జిత సేవల నిలుపుదల



శ్రీశైల మల్లికార్జున స్వామి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు శ్రీశైల క్షేత్రంలోని ఉభయ దేవాలయాల్లో ఆర్జిత సేవలను నిలుపుదల చేసినట్లు దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. భక్తులందరికీ దర్శనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భక్తులకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తామన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివమాలధారణ చేసిన భక్తులకు జ్యోతిర్ముడి కలిగి ఉంటే ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నిర్దిష్ట వేళల్లో మాత్రమే స్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తారు.

అమ్మ కడుపులో హృదయ వేదన

- కొందరు శిశువులకు పుట్టుకతోనే గుండె జబ్బులు
- మేనరిక వివాహాలు, గర్భస్థ ఇన్‌ఫెక్షన్లు, పోషకాహార లోపం కారణాలు
- ఉమ్మడి జిల్లాలో ప్రతి వెయ్యి ప్రసవాల్లో పది మందికి సమస్య
- వయస్సు పెరిగే కొద్దీ కొందరిలో సాధారణ స్థితికి
- శస్త్రచికిత్సతో మరికొన్నింటికి పరిష్కారం

సాధారణంగా ఎవ్వరికైనా హార్ట్ ఎటాక్ వచ్చిందంటే అయ్యయ్యో.. అని అంటాం. అదే అన్నెం..పుణ్యం ఎరుగని పసివారికి గుండెజబ్బులు వచ్చాయంటే అయ్యోపాపం.. ఆ దేవుడు ఎంత అన్యాయం చేశాడని మరింత బాధపడతాం. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి గుండెజబ్బులున్న పిల్లలు ఏటా జన్మిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రసవాల్లో ఒక శాతం మంది పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి ఏడు నుంచి 14వ తేదీ వరకు పుట్టుకతో వచ్చే గుండెజబ్బులపై అవగాహన వారంగా పరిగణించి చిట్టి గుండెకు ప్రమాదం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా జరిగే ప్రతి వెయ్యి ప్రసవాల్లో పది మంది శిశువులు పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న బాలల సత్వర చికిత్స కేంద్రం(డైస్)లో 2020-21 నుంచి 2024-25 వరకు 185 మంది చిన్నారులు గుండెజబ్బులకు చికిత్స పొందినట్లు నివేదికలు చెబుతున్నాయి. అలాగే ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగానికి సైతం ప్రతిరోజూ 200 మంది చిన్నారులు వివిధ వ్యాధులతో చికిత్స కోసం వస్తుండగా అందులో ఇద్దరు చొప్పున నెలకు సగటున 50 నుంచి 60 మంది గుండె జబ్బులతో బాధపడుతున్నారు. చాలా మంది చిన్నారులు పుట్టుకతోనే గుండె సమస్యలతో జన్మిస్తున్నారు. ఇలాంటి పిల్లలను చూసే అప్పట్లో దివంగత డాక్టర్ వైఎస్సార్ చేతుల మీదుగా ఆరోగ్యశ్రీ పథకం పురుడుపోసుకుంది. ఇప్పుడు ఇదే పథకం ఎన్నోవేల మంది చిన్నారులకు ప్రాణం పోస్తోంది. సాధారణంగా పిండంలో 21వ రోజుకే గుండె కొట్టుకోవడం, రక్త ప్రసరణ మొదలవుతుంది. గుండె గదులు 4 వారాలకల్లా ఏర్పడతాయి. 12 వారాలకు గుండె పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో ఎక్కడ పొరపాట్లు జరిగినా లోపాలకు దారి తీస్తాయి. ఇందులో గుండెలో రంధ్రాలు ఏర్పడటం 25 శాతం దాకా ఉంటున్నాయి. గర్భస్థ శిశువుల్లో గుండె లోపాలను 18 వారాల గర్భంలోనే ఫీటల్ ఎకో కార్డియోగ్రామ్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. దీని ద్వారా గుండె లోపాలు ముందుముందు ఎలా పరిణమిస్తాయి, బిడ్డ ఆరోగ్యం ఎలా ఉండగలదు అనేవి తెలుస్తాయి. దీన్ని బట్టి ముందుగానే శస్త్రచికిత్సలను నిర్ణయించుకోవచ్చు. కవాటాలు మూసుకుపోయిన వారికి కొన్నిసార్లు గర్భంలో ఉండగానే సరిదిద్దే పద్ధతులూ అందుబాటులో ఉన్నాయి.

గుండె వైఫల్య లక్షణాలు

గుండె గదుల మధ్య రంధ్రాలు ఉన్నప్పుడు చెడు రక్తంతో మంచి రక్తం ఎక్కువగా కలిసిపోతుంది. దీంతో ఊపిరితిత్తులకు మరింత ఎక్కువగా రక్తం చేరుకుంటుంది. ఫలితంగా ఊపిరితిత్తులు తడితడిగా అయిపోతాయి. దీంతో పిల్లలు పాలు సరిగా తాగలేరు. ఆయాసం, తరచూ న్యూమోనియా బారిన పడుతుంటారు.

చర్మం నీలంగా మారడం


చెడు రక్తం, మంచి రక్తం కలిసిపోయి ఒళ్లంతా విస్తరించడం వల్ల పెదాలు, వేళ్లు, నాలుక వంటివి నీలంగా మారతాయి. కొందరికి ఉన్నట్లుండి నీలంగా అవడం ఎక్కువ కావచ్చు. కనుగుడ్లు తేలేయొచ్చు.

నిస్సత్తువ ఆవహించడం

కవాటాలు బిగుసుకుపోవడం, రక్తం లీక్ అయ్యేవారిలో అలసట, నిస్సత్తువ వంటివి కనిపిస్తుంటాయి. ఇలాంటి వారు పెద్దయ్యాక శారీరక శ్రమను తట్టుకోలేరు. ఆటలకు దూరంగా ఉంటారు.

పిల్లల్లో గుండె జబ్బులకు కారణాలు

పోషకాల లోపం: ఫోలిక్ యాసిడ్, విటమిన్ -బీ12 లోపం గర్భస్థ శిశువులో గుండెలోపాలకు దారి తీయవచ్చు.



గర్భిణికి ఇన్‌ఫెక్షన్లు: తొలి మూడు నెలల్లో ముఖ్యంగా గర్భస్థ పిండంలో గుండె ఏర్పడే దశలో రుబెల్లా వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు సైతం లోపాలకు దారి తీయొచ్చు.

మేనరికం వివాహాలు: మేనరికపు వివాహం చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో జన్యుపరమైన కారణాలతోనూ గుండె లోపాలు తలెత్తవచ్చు. మేనరికపు వివాహాలు చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో ప్రతి వెయ్యి మందిలో 40 నుంచి 50 మందికి గుండె లోపాలు ఉండే అవకాశం ఉంది.

జన్యులోపాలు: కొందరికి జన్యులోపాలతోనూ గుండె నిర్మాణ ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు.

పురుగు మందులు, రేడియేషన్: గర్భం ధరించిన తొలివారాల్లో పురుగుల మందులు, రేడియేషన్, కొన్ని రకాల మందుల ప్రభావానికి గురైనా గుండె సమస్యలు తలెత్తవచ్చు.

పొగ, మద్యం అలవాట్లు: గర్భధారణ సమయంలో పొగతాగడం, మద్యం తాగడం వంటి అలవాట్లతోనూ గుండె ఏర్పడే ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు. ఇది లోపాలకు దారి తీయొచ్చు.

“ వెయ్యి ప్రసవాల్లో 8 మందికి గుండెజబ్బులు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జరిగే ప్రతి వెయ్యి ప్రసవాల్లో 8 మందికి గుండెజబ్బులున్నట్లు గుర్తిస్తున్నాం. చిన్నపిల్లల విభాగానికి ప్రతిరోజూ 200 మంది దాకా ఓపీకి వివిధ వ్యాధుల చికిత్స కోసం చిన్నారులు వస్తే అందులో ఇద్దరు గుండెజబ్బులతో బాధపడుతున్న వారుంటున్నారు. అలాగే ఇన్‌పేషెంట్లలో రెండు శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. పర్యావరణం, జన్యుపరం, వంశపారంపర్యం, పలు రకాల ఇన్‌ఫెక్షన్లు, మేనరికపు వివాహాలు చిన్నారుల్లో గుండెజబ్బులు రావడానికి కారణాలు.



– డాక్టర్ విజయానందబాబు, చిన్నపిల్లల విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

గర్భంలోనే గుర్తించి సరిచేయవచ్చు

మహిళ గర్భంతో ఉన్నప్పుడు గైనకాలజిస్టులు టిఫా స్కానింగ్ చేయిస్తారు. గర్భంలో శిశువుకు గుండెజబ్బులుంటే ఈ స్కాన్ ద్వారా తెలిసిపోతుంది. సమస్య ఎక్కువగా ఉండి, గర్భస్థ పిండం వయస్సు 26 వారాల లోపు ఉంటే అబార్షన్ చేయించుకోవడం మేలు. సమస్య చిన్నదిగా ఉండి గర్భంలో పిండం పెరిగే సమయంలోనూ ఆపరేషన్ చేసి సరిచేసే అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. కొందరికి జన్మించాక వయస్సు పెరిగే క్రమంలో గుండె సమస్యలు బయటపడతాయి. అప్పుడు తిరుపతి, చెన్నైలోని ఆసుపత్రులకు వెళ్లి ఆపరేషన్ చేయించుకోవచ్చు.



– డాక్టర్ పీఎస్ఎస్. లక్ష్మణస్వామి, కార్డియోథొరాసిక్ సర్జన్, కర్నూలు

బర్డ్‌ఫ్లూ రెడ్ అలర్ట్

- కర్నూలు ఎన్ఆర్‌పేటను రెడ్ అలర్ట్ జోన్‌గా ప్రకటన
- ఈ ప్రాంతంలో చికెన్, గుడ్ల అమ్మకాలు నిషేధం

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు నగరంలో బర్డ్‌ఫ్లూ సోకి బాతులు మృతిచెందిన నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమయ్యింది. నగరంలోని ఎన్ఆర్‌పేటను జిల్లా యంత్రాంగం రెడ్ అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. స్థానిక బెస్త రాజుకు చెందిన 15 బాతులు మృతి చెందడం, అందుకు బర్డ్‌ఫ్లూ కారణమని ల్యాబ్ నుంచి నివేదిక రావడంతో చుట్టూ కిలోమీటర్ మేర రెడ్ అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. ఈ ప్రాంతంలో చికెన్, గుడ్లు అమ్మకాలు చేపట్టకుండా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆరుగురు పశుసంవర్థక శాఖ అధికారులతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. కోళ్లు, బాతులు, ఇతర పక్షులు అకస్మాత్తుగా మరణిస్తుంటే వెంటనే తగిన సమాచారం ఇవ్వాలని పశుసంవర్థక శాఖ అధికారులు కోళ్లు, బర్డ్స్ పెంపకందారులకు సూచించారు.

అప్రమత్తంగా ఉండండి

కర్నూలు (హాస్పిటల్): కోళ్లకు వ్యాపిస్తున్న బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం ఆయన రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రెండు మూడు జిల్లాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాపించిందన్నారు. ఇతర జిల్లాల్లోనూ ఈ వ్యాధి వ్యాపిస్తే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చనిపోయిన కోళ్లను సక్రమంగా పూడ్చిపెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను పరిరక్షించాలి

కర్నూలు కల్చరల్: మోసాలను అరికట్టి వినియోగదారుల హక్కులను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, కూరగాయలు అమ్మే దుకాణాలను నిత్యం తనిఖీ చేస్తూ ఉండాలని ఆదేశించారు. హోటళ్లు, సూపర్ మార్కెట్లు, ఎంఎల్ఎల్ పాయింట్స్, పెట్రోల్ బంకులు, మార్కెట్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తూకాల్లో మోసాలు, కల్తీ ఆహారం, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయం లాంటివి అరికట్టాలన్నారు. ఇందుకోసం కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్‌లో దిగుబడి అమ్మకాల్లో తూకాల్లో ఎక్కువ మోసాలు జరిగే అవకాశం ఉందని, రైతులకు అన్యాయం జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, కర్నూలు అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, వినియోగదారుల సంఘం కార్యదర్శి శివమోహన్‌రెడ్డి, డీఎస్‌వో రాజా రాఘువీర్, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్‌రాజు, అడిషినల్ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

మ్యుటేషన్, సర్వేలో నిబంధనలు పాటించాలి

కర్నూలు కల్చరల్: మ్యుటేషన్, సర్వే ప్రక్రియలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో మ్యుటేషన్లకు సంబంధించి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఓఆర్ యాక్ట్ ప్రకారం నోటీసులు ఇవ్వకుండా మ్యుటేషన్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వీఆర్వోలకు నెలకు రెండు లేదా మూడు దరఖాస్తులు మాత్రమే వస్తాయని, అవి కూడా ఫీల్డ్ ఎంక్వైరీ చేయలేరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నలుగురైదుగురు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాస్‌బుక్‌లు ఇచ్చే సమయంలో సర్వేకు డబ్బులు అడిగారని ఫీడ్‌బ్యాక్ వచ్చిందని, వారి నుంచి డబ్బు వెనక్కు ఇప్పించి వారిపై క్రమశిక్షణ చర్యలకు ఫైల్ రన్ చేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీఓలను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంతో పాఠశాలలు బలోపేతం

కర్నూలు (సిటీ): క్లస్టర్ విధానంతో పాఠశాలలు బలోపేతమవుతాయని డీఈఓ శామ్యూల్ పాల్ అన్నారు. జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాధికారులు 1, 2, ప్రధానోపాధ్యాయులతో క్లస్టర్ సమావేశాలపై డీఈఓ గురువారం వర్చువల్ లెర్నింగ్ ల్యాబ్ నుంచి వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల నమోదు మొదలుకొని నాణ్యమైన విద్య అందించే వరకు ఈ విధానం ఎంతో ఉపయోగపడతుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కూడా క్లస్టర్ సమావేశాల్లో పాల్గొని వారికి హెల్త్ మేనేజ్‌మెంట్‌పై సమావేశం నిర్వహించాలన్నారు.



మద్దమాంబా.. చల్లగా చూడమ్మా!

అశేష జనవాహిని మధ్య మద్దికెర మద్దమాంబ రథోత్సవం కనులపండువగా సాగింది. ఆచార సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పెద్దనగరి, చిన్ననగరి యాదవ కుటుంబీకులు ప్రత్యేక దుస్తులతో ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుంచగా కళాకారులు నృత్యం చేస్తుండగా.. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చుతుండగా భక్తులు రథాన్ని ముందుకు కదిలించారు. భక్తులు 'మద్దమాంబకు జై'.. అంటూ రథం పైకి అరటిపళ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. – మద్దికెర



ఆలయంలో ప్రత్యేక అలంకరణలో మద్దమాంబ

చిన్నారుల అభ్యున్నతికే ఇంటింటి సర్వే



సర్వేలో పాల్గొన్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: చిన్నారులకు సంబంధించి శారీరక, మానసిక, వినికిడి, గ్రహణమొర్రి, మాట ఉచ్చారణ వంటి సమస్యలను డీఈఐసీ సెంటర్ ద్వారా ఉచితంగా పరిష్కరించి చిన్నారుల జీవనాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. గురువారం నగరంలోని ఇల్లూరు నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి ఇందిరా గాంధీ నగర్ వరకు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీగల్ సర్వీసెస్ వారు ఇంటింటి సర్వే నిర్వహించడానికి న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లచే బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈనెల 10 నుంచి 24వ తేదీ వరకు జరిగే సర్వేలో ప్రాథమిక దశలో గుర్తించగలిగిన వైకల్యాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని డీఈఐసీ సెంటర్‌కు పంపించడం జరుగుతుందన్నారు. న్యాయవాదులు నిర్మల, శివసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రేమ' రాగం.. జీవన ఆనందం

- నేడు ప్రేమికుల దినోత్సవం



ప్రేమ ఎంత మధురమో.. జీవితంలో స్థిరపడడం అంతే ముఖ్యమంటున్నారు ప్రేమికులు. ఆకర్షణను ప్రేమ అనుకోవద్దని సూచిస్తున్నారు. ఒకొరినొకరు అర్థం చేసుకుంటే జీవన ప్రయాణంలో ఎన్నేళ్లు గడిచినా కొత్తగానే అనిపిస్తుందని చెబుతున్నారు. స్వచ్ఛమైన ప్రేమ కలకాలం నిలిచి ఉంటుందని, ఆర్థిక ఇబ్బందులు రానివ్వబోదని వివరిస్తున్నారు. ఎన్నో స్థలాలు.. ప్రేమ గుర్తుగా ఉండవచ్చని, మధుర జ్ఞాపకాలు అయి ఉండవచ్చని.. అయితే ప్రేమలో విజయం సాధించినప్పుడే జీవన ఆనందం కలుగుతుందని స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం ప్రేమదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

– పత్తికొండ రూరల్/ సి.బెళగల్/ వెల్దుర్తి

మనసున మనసై..



వారిద్దరి మనసులు కలిశాయి. ఏడేళ్ల ప్రేమ ప్రయాణంలో అడ్డంకులను అధిగమించి వివాహం చేసుకుని సంతోషంగా జీవిస్తున్నారు. వెల్దుర్తికి చెందిన కమ్మర హేమాచారి.. పుత్తూరు లేబర్ ఆఫీసర్‌గా, తిరుపతి ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలుకు చెందిన పెరుగు ప్రత్యూష .. తిరుపతిలో ఎస్వీసీఈ కాలేజీలో ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. కర్నూలులోని వేర్వేరు కళాశాలల్లో డిగ్రీ చేస్తుండగా వీరికి పరిచయం ఏర్పడింది. అనంతరం స్నేహితులై.. ప్రేమ చిగురించి పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఇళ్లలో వ్యతిరేకత వచ్చినా భయపడకుండా ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా, ఇరు కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ప్రేమికుల రోజే తమ పెళ్లి రోజు అని ఆనందంగా చెబుతున్నారు.

తోడునీడగా..



వైద్యంపై ఉన్న మక్కువతో వారిద్దరూ ఒక్కటయ్యారు. జీవితంలో విజయం సాధించారు. పత్తికొండ ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కునిగిరి కల్పన, ప్రైవేట్ హాస్పిటల్ అధినేత జంగం నీలకంఠ ప్రేమ కథ ఇదీ.. మిత్రుల సహకారంతో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులను ఒప్పించారు. ఒకరికొకరు తోడునీడగా ఉంటూ ఆదర్శ దంపతులుగా పేరు సాధించారు. కునిగిరి కల్పన.. ఎంబీబీఎస్, ఆ తరువాత పీజీ పూర్తి చేసి గైనకాలజిస్టు అయ్యారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జంగం నీలకంఠ.. సొంతంగా హాస్పిటల్ నిర్మించారు. సొంత ఊరులో ప్రజలకు వైద్యసేవలందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రేమించి పెళ్లి చేసుకోవడమే కాదు.. ఎళ్ల కాలం ఆ ప్రేమ నిలిచేలా ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలి.

సేవలు కలిపాయి..



సి. బెళగల్‌కు చెందిన శ్రీను, కర్నూలుకు చెందిన నేహా నస్రీన్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. రాష్ట్రంలో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామ సచివాలయాల్లో వీరిద్దరికీ డిజిటల్ అసిస్టెంట్ల (డీఏ) పోస్టులు వచ్చాయి. ప్రభుత్వం తరఫున ప్రజలకు సేవ చేయడం వీరిద్దరినీ కలిపాయి. శ్రీను, నేహానస్రీన్‌లు ఒకరిని ఒకరు ఇష్టపడి 2022 ఫిబ్రవరి 22న ప్రేమ వివాహం చేసుకున్నారు. సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి - 2 (గొల్లలదొడ్డి) గ్రామ సచివాలయంలో డీఏగా శ్రీను విధులు నిర్వర్తిస్తుండగా, సి.బెళగల్ గ్రామ సచివాలయం - 2లో డీఏగా నేహా నస్రీన్ పనిచేస్తున్నారు. ఈ దంపతులకు సంవత్సరం వయస్సు ఉన్న అయాన్ అనే కుమారుడు ఉన్నాడు.

క్లుప్తంగా

ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో అగ్నిప్రమాదం

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పక్కనున్న ప్రాంతీయ శిక్షణా కేంద్రం(మేల్) ఆవరణలో అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం మధ్యాహ్న భోజనం వేళ కార్యాలయ ఆవరణలో నిలిపి ఉన్న పాతవాహనాల వద్ద మంటలు చెలరేగాయి. ప్రమాదంలో స్క్రాబ్‌లో ఉంచిన(కాలపరిమితి ముగిసిన) మూడు జీపులు, ఒక అంబులెన్స్ కాలిపోయాయి. ఈ వాహనాలను 2018లో జిల్లా ఇమ్యునైజేషన్ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అక్కడ ఉన్న పాత వాహనాలను ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఆవరణకు తరలించారు. మధ్యాహ్నం వేళలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఎవరైనా మూత్రవిసర్జనకు వెళ్లి సిగరెట్ ముక్కను ఆర్పకుండా పారవేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని ఉద్యోగులు భావిస్తున్నారు.

హంద్రీనీవా కాలువలో బాలుడి గల్లంతు


తులసీగౌడ్(ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హంద్రీనీవా కాలువలో గురువారం 12 ఏళ్ల బాలుడు గల్లంతయ్యాడు. డోన్‌కు చెందిన దామోదర్‌గౌడు, రాజేశ్వరి దంపతులు కుమారుడు తులసీగౌడ్‌తో కలిసి గత శుక్రవారం గ్రామంలో జరిగిన ఆలయాల ప్రారంభోత్సవానికి వచ్చారు. గురువారం ఉదయం గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లిన తులసీగౌడ్ కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ జారి నీటిలో పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని అధికారులకు విషయం చేరవేశారు. ఫైర్ స్టేషన్ ఎస్‌ఐ దినకర్‌బాబు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో సాయంత్రమైనా ఆచూకీ లభించలేదు. సీఐ జయన్న గ్రామస్తులతో విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

- మరొకరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయాలపాలైనట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. పాణ్యం చెంచు కాలనీకి చెందిన తోట ఆంజనేయులు (26), సోదరుడు లక్ష్మన్న తమ్మరాజుపల్లె నుంచి బైక్‌పై పాణ్యం బయలుదేరారు. సుగాలిమెట్ట వద్ద ఎరువుల ట్రాక్టర్ రాంగ్ రూట్లో వస్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మన్న తీవ్రగాయాలపాయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. మృతుడికి భార్య చిందులు, ముగ్గురు కుమారులు ఉన్నారు. హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

శివయ్యా.. నీ చెంత చేరే దారేది?


సీతమ్మబావి నుంచి భీమునికొలనుకు వెళ్లే రహదారి దృశ్యం

మహాశివరాత్రి పర్వదినం సమీపిస్తోంది. శ్రీశైలం మల్లన్న దర్శనానికి భక్తులు కాలినడకన బయలుదేరేందుకు సిద్ధమవుతున్నారు. వందలు కాదు.. వేలు కాదు.. లక్షలాది మంది భక్తులు శ్రీశైల క్షేత్రాన్ని ఏటా దర్శించుకుంటున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది ఇప్పటికే శివ మాల ధరించిన భక్తులు తమ దీక్షా కాలాన్ని పూర్తి చేసుకుని నిష్టాగరిష్టులై స్వామి దర్శనానికి వేచి ఉన్నారు. ఈ నెల 19 నుంచి మార్చి 1 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసిన దేవస్థానం, దేవదాయశాఖ అధికారులు పాదయాత్ర భక్తులను మాత్రం విస్మరించినట్లున్నారు. జంగిల్ క్లియరెన్స్, తాగు నీటి ఏర్పాట్లను మొదలే పెట్టకపోవడంతో పాద యాత్ర భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివయ్యా.. నీ చెంతకు చేరే దారేదయ్యా అంటూ లోలోనే మదన పడుతున్నారు.

మల్లన్న భక్తులకు తప్పని నడక కష్టాలు

- భీమునికొలను, కత్తులకొండపై ముళ్లకంపలు, గుళకరాళ్లు
- జంగిల్ క్లియరెన్స్‌ను, తాగు నీటి ఏర్పాట్లను పట్టించుకోని శ్రీశైలం దేవస్థానం, అటవీశాఖ అధికారులు
- పాదయాత్ర భక్తులకు ఏటా తప్పని తిప్పలు

ఆత్మకూరు: శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లాలనుకునే భక్తుల్లో చాలా మంది వెంకటాపురం మీదుగా ప్రయాణాన్ని సాగిస్తూ ఉంటారు. ఆత్మకూరు నుంచి వెంకటాపురం మీదుగా శ్రీశైలానికి 45 కిలోమీటర్ల దూరం అవుతుంది. 41 రోజులు కఠోర దీక్షలో ఉంటూ, శివనామస్మరణ చేస్తూ, నేలపై నిద్రించి అనునిత్యం శివ నామాన్ని జపించే శివమాలధారులు చివరిగా ఆ శివయ్యను చేరుకునేక్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 20 రోజులకు పైగా భక్తుల రద్దీ కొనసాగే ఈ ఈ 45 కిలోమీట్ల నడక దారిలో జంగిల్ క్లియరెన్స్‌ను ఇటు శ్రీశైలం దేవస్థానం గానీ.. అటు అటవీశాఖ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు.

బొబ్బలెక్కిన కాళ్లకు... గుళక రాళ్లు మరింత అడ్డంకి

వెంకటాపురం గ్రామం నుంచి కాస్త దూరం వెళ్లగానే నాగలూటి క్షేత్రం చేరుకుంటారు. ఈక్రమంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. చిన్న దారి, గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలు, రాలిపడిన ఆకుల కింద ముళ్లు భక్తులకు ఇబ్బందిగా మారనున్నాయి. అక్కడ వీరభద్రస్వామిని దర్శించుకుని ఎగువగట్టుకు వెళ్లేక్రమంలో ప్రతి ఐదు లేదా పది నిమిషాలకోసారి మల్లన్నా.. నీ దర్శనం ఎప్పుడంటూ నడవలేక ఆగిపోయే పరిస్థితులున్నాయి. అతికష్టమైనా మెట్లు ఎక్కే భక్తులకు. చెత్తచెదారం కాళ్లకు గుచ్చుకుంటే మాత్రం భరించలేదు. ఎలాగో కష్టపడి గట్టు దిగిన భక్తులకు పెచ్చెరువుకు చేరుకోవడం సులభమే. కానీ సాదులమఠం, సీతమ్మబావి, భీమునికొలను చేరే క్రమంలోనూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా భీముని కొలనులోయలో పడే ప్రమాదముందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతి కష్టంపై ఒకరి చేయి మరొకరు పట్టుకుని మరో చేత్తో కొండ గట్టును పట్టుకుని ఒక్కొక్కరుగా ముందుకుసాగాల్సిన దుస్థితి ఉంది. భీముని కొలను దిగగానే కైలాస ద్వారానికి వెళ్లే మెట్ల మార్గం మరో ఛాలెంజ్. ఆ తర్వాత కైలాస ద్వారం నుంచి హాటకేశ్వరం క్షేత్రం చేరే సమయంలోనూ దారి అస్తవ్యస్తంగా ఉంది. ఇలా 45 కిలోమీటర్ల ప్రయాణంలో భక్తుల పాదాలకు గుచ్చుకునే పదునైన కొండరాళ్లు తీవ్ర అంతరాయంగా మారుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి నడిచి రావడంతో అప్పటికే బొబ్బలెక్కిన కాళ్లకు వెదురుబొంగులు, పదునై ఎర్రరాళ్ల కొస వల్ల మరింత కష్టంగా మారుతున్నాయి.


నాగలూటి నుంచి ఎగువ ఘాట్‌పైన కనిపించే తొలి ద్వారం

కొరవడిన సమన్వయం..

శ్రీశైలం దేవస్థానం, అటవీ శాఖ అధికారుల మధ్య సమన్వయం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 32 ఏళ్లకు పైగా శివమాలధారణ ప్రారంభమైనప్పటి నుంచి నడకమార్గం ఎప్పుడూ శుభ్రం చేయకపోవడమే అందుకు నిదర్శనం. శ్రీశైలం దేవస్థానం అధికారులు తూతూ మంత్రంగా నిధులిస్తుండటంతో ఫారెస్టు అధికారులు కూడా అంతే రీతిలో పనులు చేసి చేతులు దులుపేసుకుంటున్నారు. కేవలం నాగలూటి క్షేత్రం వద్ద ఉన్న రెండు కోనేరులను శుభ్రం చేయడం, నాగలూటి వరకు అక్కడక్కడా వెదురుబొంగులు తొలగించడం మినహా.. రహదారి విశాలంగా చేయడం కానీ, నడక దారి భక్తుల కాళ్లకు గుచ్చుకోకుండా రాళ్లను తొలగించడం కానీ చేసిన దాఖలు లేదు. కాగా తాము నిధులిస్తున్నా.. అటవీ శాఖ దేనికి ఖర్చు చేస్తుందో చెప్పడం లేదని దేవస్థానం అధికారులు ఆరోపిస్తున్నారు.

దారి పొడవునా జంగిల్ క్లియరెన్స్ చేయాలి



శ్రీశైలం క్షేత్రానికి వెంకటాపురం నుంచి పాదయాత్ర కొనసాగించే భక్తులకు ఇబ్బంది లేకుండా కనీసం దారిలో గుచ్చుకునే రాళ్లనైనా తొలగించేందుకు అటవీశాఖ, శ్రీశైలం దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏటా భక్తుల కోసం నామమాత్రంగా కొన్ని పనులు చేసి చేతులు దులుపుకోవడం సరికాదు. తప్పనిసరిగా రహదారి వెంట ఇరువైపులా కంప చెట్లను, వెదురుబొంగులను, మొనదేలిన రాళ్లను తొలగించాలి.

– విశ్వంభర మద్దుల రమణారెడ్డి, శివస్వామి, ఆత్మకూరు

తాగు నీరు ఏర్పాటు చేయాలి



యేటేటా శ్రీశైలం మహా క్షేత్రానికి లక్షలాదిగా తరలివెళ్లే శివ స్వాములు, భక్తులకు తప్పనిసరిగా అధికారులు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఇప్పటికే నాగలూటి చెంచుగూడెం, పెచ్చెరువు, నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం వద్ద బోర్లు చెడిపోయాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయడమేగాకుండా ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక చోట తాగునీరు ఏర్పాటు చేయాలి. సాదుల మఠం, సీతమ్మబావి, భీమునికొలను వరకు భక్తులకు నీటి సౌకర్యం కల్పించాలి.

– సంజీవరెడ్డి, శివస్వామి, సిద్ధపల్లి గ్రామం


అశేష జనవాహిని మధ్య సాగుతున్న చాడేశ్వరీదేవి రథోత్సవం

రమణీయం.. చౌడేశ్వరీ దేవి రథోత్సవం



కోడుమూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి రథోత్సవం గురువారం సాయంత్రం అశేషజనవాహిని మధ్య రమణీయంగా సాగింది. ముందుగా దైవచార అటకార సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవ వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఊరవకొండ కళాకారులు బొమ్మల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

– కోడుమూరు రూరల్

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

కర్నూలు (టౌన్): రోడ్డు మీద దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు నగరంలోని పెద్ద పడఖానకు చెందిన మక్బూల్. గురువారం మక్బూల్ మసీదులో సమాజ్ చేసుకుని తిరిగి ఇంటికి వచ్చే సమయంలో రోడ్డు మీద మొబైల్ ఫోన్ దొరికింది. నేరుగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీ బాబు ప్రసాద్‌కు అప్పగించాడు. అప్పటికే ఎర్రబురుజుకు చెందిన మహేశ్వర్ ఆచారి ఓల్డ్ ఆంధ్రాబ్యాంకు వద్ద తన పిల్లలతో బయటకు వెళ్లిన సమయంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఇదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుని డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి సెల్ ఫోన్‌ను అప్పగించారు. నిజాయితీ చాటుకున్న మక్బూల్‌ను డీఎస్పీ అభినందించారు.


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు


నగేష్

ఆదోని రూరల్/పెద్దకడబూరు: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు ఆదోని కోర్టు జీవిత ఖైదు(యావజ్జీవ కారాగార శిక్ష) విధించినట్లు కోర్టు మానిటరింగ్ ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు. కేసుకు సంబంధించి పెద్దకడబూరు పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దకడబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన కురువ నాగేష్‌కు కోసిగి మండలం సజ్జల గుడ్డం గ్రామానికి చెందిన జయలక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 20న అర్ధరాత్రి భార్యతో గొడవ పడి తాగిన మైకంలో గొడ్డలితో నరికి హత్య చేశాడు. మృతురాలి తండ్రి యల్లప్ప ఫిర్యాదు మేరకు అప్పటి ఏఎస్‌ఐ శివరాములు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ప్రసాద్ కేసును దర్యాప్తు చేసి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. విచారణ అనంతరం నిందితుడు నగేష్‌పై నేరం రుజువు కావడంతో ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పీజే సుధ జీవిత ఖైదుతో పాటు రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అనంతరం ఖైదీని పోలీసులు సబ్ జైలుకు తరలించారు.

మహిళపై దాడి కేసులో నలుగురికి ఐదేళ్ల జైలు

ఆళ్లగడ్డ: మహిళపై దాడి చేసిన నలుగురుకి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.4 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆళ్లగడ్డ కోర్టు గురువారం తీర్పు చెప్పింది. రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అశోక్ తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని కోరినందుకు మండల కేంద్రం చాగలమర్రికి చెందిన ముత్యాలపాడు మహబూబ్‌బీపై 2016 మే 16న చాగలమర్రి మండలం పెద్ద బోధనం గ్రామానికి చెందిన గడ్డ కిశోర్, గజ్జల బాలయ్య, లక్ష్మీదేవి, టంగుటూరి అశోక్ దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న చాగలమర్రి పోలీసులు నిందులను అరెస్ట్ చేసి కోర్టులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించిందని సీఐ తెలిపారు.


శిక్ష పడిన నిందితులు

విద్యుదాఘాతంలో కూలీకి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి గ్రామంలో గురువారం విద్యుత్ లైన్ మరమ్మతుల పనుల్లో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతనికి గురై జార్ఖండ్‌కు చెందిన సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాంట్రాక్టర్ జార్ఖండ్ నుంచి కూలీలను రప్పించి కొన్ని రోజులుగా గ్రామంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేయిస్తున్నారు. ఈక్రమంలో ఉదయం పనులు జరిగేటప్పుడు రెండు లైన్లలో విద్యుత్ సరఫరా అవుతుండటంతో విద్యుత్ అధికారులు ఒక లైన్ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మరో లైన్ విద్యుత్ సరఫరా నిలిపివేసిన తరువాత పనులు మొదలు పెట్టాలని కాంట్రాక్టర్ కూలీలకు చెపుతుండగా సందీప్ అనే కూలీ నేను స్తంభం పైకి ఎక్కేలోపు లైన్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారులే అంటు ఎక్కాడు. వైర్లు పట్టుకోవటంతో విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. వెంటనే తోటి కూలీలు సందీప్‌ను ఆటోలో బనవాసిఫారం వరకు తీసుకురాగా అక్కడ నుంచి 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు మద్దిలేటయ్య క్షేత్రంలో వేలం పాటలు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రామాంజనేయులు గురువారం తెలిపారు. ఆలయ ఆవరణలో దుకాణాల ఏర్పాటుకు, వంట చెరకు విక్రయానికి, గోశాలకు గడ్డి సరఫరాకు, స్వామి వారి చిత్ర పటాలు ఏడాది పాటు విక్రయించుకోవడానికి బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నామని ఆసక్తి ఉన్న వారు దేవదాయ శాఖ నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలన్నారు.

రేపు జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. జాబ్‌మేళాలలో 5 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటె క్, పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9440224291, 9182217075ను సంప్రదించాలన్నారు.

అయ్యో 'పాప'ం

- మురుగు కాలువలో ఆడ శిశువు మృతదేహం

ముద్దూమురిపెంతో లోకం చూపుతావునుకుంటే
మనసే లేనట్టు విసిరేశావేంటమ్మా!
చలికి వణికిపోతున్న నన్ను నీ వెచ్చటి పొత్తిళ్లలో
దాచుకుంటావునుకుంటే
కాస్తైనా కరుణ లేకుండా మురుగునీటిలో పడేశావేంటమ్మా!
ఆడపిల్లనని వదిలించుకుంటున్నావా?
అమ్మకాని అమ్మవైనందుకు భయపడుతున్నావా?
తప్పు నువ్వు చేసి శిక్ష నాకేశావేంటమ్మా?
అయినా నువ్వు నా అమ్మవు కదా!
మురుగునీరు.. నువ్వు పోస్తున్న లాలలాగుంది..
దోమల మోత.. నువ్వు పాడుతున్న జోలపాటలా ఉంది!
అందుకే నీ తప్పును ఎవరికీ చెప్పకుండా నిద్రపోతా..
శాశ్వతంగా నిద్రలోకి జారుకుంటా!


మురుగు కాలువలో శిశువు మృతదేహం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సోగనూరు రోడ్డులో గురువారం మురుగు కాలువలో ఆడ శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ డాక్టర్ నాయక్, సిబ్బంది కాలువలో ఉన్న ఆడ శిశువు మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి గర్భం నుంచి బయటపడి ఒక్క రోజు అయి ఉండవచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. శిశువు బొడ్డు తాడు కూడా కోయకుండానే మురుగు కాలువలో పడేశారు. లేత చర్మం అవటంతో చేతుల నుంచి చర్మ ఊడిపోయింది. నెలలు నిండకుండా పుట్టి, చనిపోయిన బిడ్డను కాలువలో పడేశారా? లేక ఆడ బిడ్డ అని వదిలేసుకున్నారో తెలియడం లేదు. కాలనీలో విచారిస్తున్నామని టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా ఆడబిడ్డను మురుగు కాలువలో పడేయడానికి చేతులెట్లా వచ్చాయోనని స్థానిక మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు.

జిల్లెల్ల -1 ఎంపీటీసీ సభ్యురాలి రాజీనామా

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల్ల ఎంపీటీసీ -1 సభ్యురాలు గొటికె రమాదేవి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం ఆమె జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డిని కలిసి తన రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం తన వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.


జెడ్పీ సీఈఓకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న గొటికె రమాదేవి

అట్టహాసంగా గార్ధబాల పోటీలు


నంద్యాల వ్యవసాయం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న జంబులాపరమేశ్వరి ఆలయ తిరునాల సందర్భంగా గురువారం గార్ధబాల పోటీలు(120 కేజీల ఇసుక బస్తాల విభాగం) అట్టహాసంగా నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి, వెలుగోడు, ఆత్మకూరు, మహానంది మండలాల గార్ధబాలలు పోటీలో పాల్గొన్నాయి. ఆలయ ప్రధాన కార్యదర్శి గాండ్ల జగన్‌మోహన్ పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి వేల్పనూరు ఎల్లా నాగయ్య గార్ధబం, రెండవ బహుమతి పెద్దవంగళికి పెద్దపాములేటి గార్ధబం, మూడవ బహుమతి మిట్టపల్లి పెద్ద గురువయ్య గార్ధబం సాధించి వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేల నగదు బహుమతులు గెలుచుకున్నాయి.


పోటీలో పాల్గొన్న గార్ధబం

ఎస్సీ, ఎస్టీలపై దాడులు




దేశవ్యాప్తంగా 2020–22 మధ్య ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయి. జాతీయ నేర గణాంక విభాగం లెక్కల ప్రకారం.. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎస్సీలపై దాడులు ఎక్కువ జరిగితే.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో ఎస్టీలపై దాడులు చాలా ఎక్కువ జరిగాయి. ఆ మూడేళ్లలో ఎస్సీలపై దాడులకు సంబంధించి 1.58 లక్షలకుపైగా కేసులు నమోదైతే, ఎస్టీలకు సంబంధించినవి 27వేలకు పైగా నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ మహిళలపై జరిగిన దాడుల్లో అత్యధికం అత్యాచార కేసులే.



కాలు కదపకుండా కోరిన సర్వీస్

పెరుగుతున్న 'ఆన్ డిమాండ్ హోమ్ సర్వీసెస్'
ఫోన్ చేయగానే ఇంటికే వస్తున్న వస్తువులు

సాక్షి, అమరావతి: ఒకప్పుడు ఇంటికి కిరాణా సరుకులు కావాలంటే దుకాణానికి వెళ్లే వారు. ఫ్యాన్సీ వస్తువులు కావాలన్నా షాపులోనే కొనేవారు. మొబైల్ కావాలంటే పది దుకాణాలు తిరిగేవారు. ఇంట్లో కరెంటు రిపేర్లకు ఎలక్ట్రీషియన్ దగ్గరికి వెళ్లో లేదా ఫోన్ చేసో పిలిపించుకోవాల్సిందే. టీవీ, ఫ్యాను, మిక్సీ వంటివి పాడైతే కంపెనీ సర్వీస్ సెంటర్‌కో, రిపేర్ షాపుకో పట్టుకెళ్లేవారు. ఇప్పుడు ఏ పనికీ ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. కావాల్సిన సరుకులు యాప్‌లో ఆర్డర్ పెడితే ఇంటికొచ్చేస్తున్నాయి. విద్యుత్ పరికరం ఏది పాడైనా మొబైల్ యాప్స్ ద్వారానే టెక్నీషియన్లు ఇంటికే వచ్చి రిపేరు చేస్తున్నారు. ఇంటిని శుభ్రం చేయడం, తోటమాలి, ఇంటి పని, వంట మనిషి సేవలు, దుస్తులు ఉతకడం, ఇస్త్రీ చేయడం, కారు, బైక్ వాష్, ఏసీ, వాటర్ హీటర్, వాటర్ ప్యూరిఫైయర్ మరమ్మతులతో పాటు హెల్త్ కేర్ సేవలు, వైద్యం, బ్యూటీ, సెలూన్ సర్వీసెస్, ఫిట్‌నెస్ కోచ్, ట్యూటర్, ఫిజియోథెరపీ, బేబీ సిట్టింగ్, పెట్ కేర్, ఫుడ్ డెలివరీ, ట్రావెల్, ట్రాన్స్‌పోర్ట్ వంటి అనేక సేవలు ఇప్పుడు ఇంటి ముంగిటకే వచ్చి వాలుతున్నాయి. కొంత కాలం క్రితం వరకూ ఈ వెసులుబాటు కొన్నింటికే ఉండేది. ఇప్పుడు అన్ని సేవలూ ఆన్‌లైన్ ద్వారానే అందుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా జరగని పని అంటూ ఒక్కటీ కనిపించదు. అనేక సంస్థలు 'ఆన్ డిమాండ్ హోమ్ సర్వీసెస్' అందిస్తున్నాయి. గూగుల్‌లో మనకు ఏది అవసరమో టైప్ చేస్తే ఆ సేవలందించే సంస్థలు, వాటి రేటింగ్‌లతో సహా వస్తాయి. మనం ఎంచుకొన్న సంస్థకు ఫోన్ చేసినా, లేదా వాళ్ల యాప్‌లో అప్లై చేసినా నిర్దేశిత సమయంలో ఇంటికే వచ్చి ఆ సేవలందించి వెళ్తారు.



'ఆన్ డిమాండ్ హోమ్ సర్వీసెస్' మార్కెట్ విలువ చూస్తే ఆశ్చర్యం **కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ** మార్కెట్ ప్రస్తుత టర్నోవర్ **5,790 మిలియన్ డాలర్లు. ఇది 2030** నాటికి 14,785 మిలియన్ **డాలర్లకు చేరుతుందని 'హారిజన్ గ్రాండ్** వ్యూ రీసెర్చ్' అనే అం**తర్జాతీయ పరిశోధన సంస్థ ఇటీవల** వెల్లడించింది. మన దేశం **లోనూ ప్రస్తుతం 284 మిలియన్ డాలర్లుగా** ఉన్న ఈ మార్కెట్ 2030 **నాటికి 1,092 మిలియన్ డాలర్లకు** పెరుగుతుందని తెలిపింది. **అయితే ఈ మార్కెట్‌కు నిపుణుల** కొరత ఓ సమస్య. కొం**దరు గృహాల్లోకి అపరిచిత** వ్యక్తులను రానివ్వరు. **ఇది మరో సమస్య. వచ్చే** వారికి లైసెన్స్, ఐడెంటిటీ **కార్డులు వంటివి లేకపోవడం** వారి భయానికి కారణం. **అయినప్పటికీ మార్కెట్ విస్తరిస్తూనే** ఉంది. దీంతో అమెజాన్ **వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా** హోమ్ సర్వీసెస్ రంగం**లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాయి.**





విజయవాడ కరెన్సీనగర్‌లో కారును శుభ్రం చేస్తున్న ఈ వ్యక్తి పేరు మంజల్. అసోం రాష్ట్రం నుంచి బతుకుతెరువు కోసం ఇక్కడికి వచ్చాడు. ఇక్కడ 'మొబైల్ కార్ వాష్' పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించాడు. అతనితో వచ్చిన మరో యువకుడు కూడా ఈ సంస్థలో చేరాడు. ఓ వ్యానులో నీళ్లు, అవసరమైన యంత్రాలు, ఓ జనరేటర్ అమర్చుకున్నారు. ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వచ్చి కారు, బైక్‌ను శుభ్రంగా కడిగేసి, పాలిష్ పెట్టిస్తారు. వాహనదారులు కార్ వాష్ వద్ద ఎంత చెల్లిస్తారో వీళ్లూ అంతే తీసుకుంటారు. దీనివల్ల ఎక్కడెక్కడికో వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. సమయం ఆదా అవుతుంది.

– ఇటీవల కాలంలో ఇలా ఇంటి వద్దకే అందే హోమ్ సర్వీసెస్ విస్తృతమవుతున్నాయి.

స్వయం ఉపాధి, ఉద్యోగాలు

'గుడ్ మార్నింగ్ సార్.. నమస్తే మేడమ్.. చెప్పండి మేం మీకే విధంగా సాయపడగలం'.. ఏదైనా హోమ్ సర్వీసెస్ సంస్థకు ఫోన్ చేయగానే వినిపించే మాటలివి. పాలు, కూరగాయల దగ్గర్నుంచి.. ఖరీదైన కార్ల వరకూ ఏది కావాలన్నా, ఎప్పుడు కొనాలన్నా ఇంట్లోనే కూర్చుని ఫోన్ ద్వారానే తెప్పించేసుకోవచ్చు. ఈ హోమ్ సర్వీసెస్ ద్వారా ఎంతో మందికి ఉద్యోగాలు దొరుకుతున్నాయి. నచ్చిన సమయంలో పని చేసే వెసులుబాటూ ఉంది. దీంతో పని చేసేందుకు వచ్చే వారూ వెనుకాడటం లేదు. మరి కొంతమంది యువత ఈ వ్యాపారన్నే స్వయం ఉపాధిగా మలచుకొని పలువురికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

క్లుప్తంగా...

శివరాత్రికి 3,500 ప్రత్యేక బస్సులు



సాక్షి, అమరావతి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలో 99 శైవ క్షేత్రాలకు 3,500 ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని డిపో మేనేజర్లను ఆదేశించింది. శైవ క్షేత్రాల్లో బస్ డిపోల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రయాణికులకు సమాచారం అందించేందుకు మైక్ సిస్టంను ఏర్పాటు చేయాలని పేర్కొంది.

వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర పార్టీ అధ్యక్షురాలిగా షేక్ నూరి ఫాతిమా

పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా రమేశ్ గౌడ్, రవిశంకర్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు షేక్ నూరి ఫాతిమాను గుంటూరు నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలిగా నియమించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా చిట్లూరు రమేశ్ గౌడ్(అనంతపురం), రాచమల్లు రవిశంకర్ రెడ్డి (వైఎస్సార్ జిల్లా)లను నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

గన్నవరం: కృష్ణా జిల్లా గన్నవరంలోని టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో 31 మంది వైఎస్సార్‌సీపీ నేతల ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. అయితే, ఒకరికి మాత్రం అనారోగ్య కారణాల రీత్యా ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. వివరాలిలా ఉన్నాయి... రెండేళ్ల క్రితం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసులో ఇప్పటివరకు పోలీసులు, సీఐడీ అధికారులు 45 మందిని అరెస్ట్ చేశారు. మరో 32 మంది ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించగా, ముందు ట్రయిల్ కోర్టులో పిటిషన్ వేయాలని, రెండు వారాలపాటు వారిపై చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ముందస్తు బెయిల్‌పై వాదనలు బుధవారంతో ముగిశాయి. మొత్తం 32 మందికిగాను 31 మంది ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. ఈ కేసులో మన్నె సుందరరావుకు అనారోగ్య కారణాల రీత్యా ముందస్తు బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. ఇప్పటికే విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఆరుగురితోపాటు తోట వెంకయ్య, హేమంత్, మట్టా నవీన్‌లకు రెగ్యులర్ బెయిల్‌ను కోర్టు ఇచ్చింది.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా గౌతమ్‌కుమార్

సాక్షి, అమరావతి: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఏపీ నూతన అధ్యక్షుడిగా బందెల గౌతమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ నెల 10న పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి గౌతమ్‌కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ఎంటీఎస్, హెచ్ఆర్ ఇవ్వాలి

జాయింట్ యాక్షన్ కమిటీ వినతి

సాక్షి, అమరావతి: నేషనల్ హెల్త్ మిషన్‌లోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు గురువారం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం హెచ్ఆర్ సెల్ ఏర్పాటు చేసి, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు.

వల్లభనేని వంశీ అరెస్టు

అర్ధరాత్రి కోర్టులో హాజరుపర్చిన పోలీసులు.. 2 గంటల వరకూ కొనసాగిన వాదనలు

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్/పటమట/కృష్ణలంక (విజయవాడ తూర్పు)/కోనేరు సెంటర్ (మచిలీపట్నం): కృష్ణాజిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని విజయవాడ పటమట పోలీసులు గురువారం ఉదయం హైదరాబాద్‌లో నాటకీయ పరిణామాల మధ్య అరెస్టుచేశారు. ఉదయం ఏడు గంటలకు అయన్ను అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించారు. రెండేళ్ల క్రితం గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్, దాడి చేశారనే ఆరోపణలతో పోలీసులు ఆయనపై బీఎన్ఎస్ క్లాజ్ 140 (1), 308, 351 (3) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. అంతకుముందు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏడీసీపీ రామకృష్ణ తన బృందంతో హుటాహుటిన హైదరాబాద్ చేరుకుని వంశీ కోసం గాలింపు చేపట్టారు. రాయదుర్గం మైహోం భుజాలోని తన ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని అక్కడకెళ్లి వంశీకి బీఎన్ఎస్ఎస్ 47 (1) నోటీసును అందించి ఉన్నపళంగా అరెస్టు చేశారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో మధ్యాహ్నం విజయవాడకు తీసుకొచ్చారు. కొద్దిసేపు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఉంచి, అనంతరం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ కేసు విచారణ అధికారిగా వ్యవహరిస్తున్న సెంట్రల్ ఏసీపీ కె. దామోదరరావుతోపాటు లా అండ్ ఆర్డర్ ఏడీసీపీ జి. రామకృష్ణ రాత్రి తొమ్మిది గంటల వరకు వంశీని ఎనిమిది గంటలపాటు విచారించారు. అనంతరం.. వైద్య పరీక్షల నిమిత్తం ఆయన్ను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరోవైపు.. వంశీ అనుచరులైన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన ఏలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్ (35), కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన నిమ్మ లక్ష్మీపతి (35)లను కూడా పటమట పోలీసులు గురువారం రాత్రి అరెస్టుచేశారు. వైద్య పరీక్షల నిమిత్తం వారినీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం.. వంశీని కోర్టులో హాజరుపరచగా అర్ధరాత్రి 2 గంటల వరకు వాదనలు కొనసాగాయి.



వంశీని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చిన పోలీసులు

న్యాయ వ్యవస్థ అంటే లెక్కలేనట్లుగా..

ఇక రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం వేధింపులతో బరితెగిస్తోందనడానికి వంశీ అరెస్టే ఉదాహరణ. ఎందుకంటే.. ఏకంగా న్యాయమూర్తి ఎదుట స్వచ్ఛందంగా 164 సీఆర్‌పీసీ కింద నమోదుచేసిన వాంగ్మూలాన్ని కూడా బేఖాతరు చేస్తూ అక్రమ కేసులకు టీడీపీ కూటమి సర్కారు తెగిస్తోంది. అసలు వంశీపై అక్రమ కేసుకు ప్రాతిపదికగా పోలీసులు చెబుతున్న గన్నవరం టీడీపీ ఆఫీసు కంప్యూటర్ ఆపరేటర్ ముదునూరి సత్యవర్ధన్ ఫిర్యాదే అబద్ధమని కోర్టు సాక్షిగా ఇటీవల తేలిపోయింది. ఖాళీ కాగితాలపై తన సంతకం తీసుకుని ఫిర్యాదు చేశారని.. అసలు ఫిర్యాదులో ఏముందో కూడా తనకు తెలియదని సత్యవర్ధన్ సాక్షాత్తూ న్యాయమూర్తి ఎదుట స్పష్టం చేశారు. వంశీ తనను బెదిరించనేలేదని.. తనపై దౌర్జన్యం చేయలేదని స్వచ్ఛందంగా వెల్లడించి తన ఫిర్యాదును వాపసు తీసుకున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు ఇది అవమానంగా భావించి ఎలాగైనా వంశీని అరెస్టుచేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో సుదీర్ఘ చర్చల అనంతరం సత్యవర్ధన్ కిడ్నాప్ పన్నాగం పన్నినట్లు తెలుస్తోంది. మరోవైపు.. పోలీసులు సైతం కోర్టులోని పరిణామాలన్నింటినీ బేఖాతరు చేస్తూ రెడ్‌బుక్ కుట్రనే కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో సత్యవర్ధన్ తమ్ముడు కిరణ్‌పై ఒత్తిడి తెచ్చి అవాస్తవ ఆరోపణలతో మరో అబద్ధపు ఫిర్యాదును ఈ నెల 12న ఇప్పించారు. మాజీ ఎమ్మెల్యే వంశీ, కొమ్మా కోట్లు, భీమవరపు రామకృష్ణ, గంటా వీర్రాజు తదితరులు తన సోదరుడిని కిడ్నాప్ చేసి కేసు వాపసు తీసుకునేలా బెదిరించి, భయపెట్టారని అందులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే పటమట పోలీసులు వంశీపై అక్రమ కేసు నమోదు చేశారు. అంటే.. తమకు అసలు న్యాయ వ్యవస్థ అంటే ఏమాత్రం లెక్కలేదన్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వం బరితెగిస్తోందన్నది వంశీ అరెస్టు ద్వారా స్పష్టమవుతోంది. కాగా, వంశీ అరెస్టుపై విజయవాడ పటమట పోలీసుస్టేషన్‌లో గురువారం హైడ్రామా నడిచింది. హైదరాబాదు నుంచి వంశీని పటమట స్టేషన్‌కు తీసుకొస్తారని పోలీసులు లీకులు ఇవ్వడంతో మీడియా అంతా అక్కడికి చేరుకుంది. చివరికి భవానీపురం స్టేషన్‌కు, అక్కడ వంశీని కారుమార్చి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో రైటర్, ఇతర సిబ్బంది కేసుకు సంబంధించిన పత్రాలను రహస్యంగా తరలించారు.

సత్యవర్ధన్ స్టేట్‌మెంట్ రికార్డు..

మరోవైపు ముదునూరు సత్యవర్ధన్ గురువారం సాయంత్రం పటమట పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. ఆయన్ను పోలీసులు రహస్యంగా స్టేషన్‌లో ఉంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. వంశీ అరెస్టు నేపథ్యంలో సత్యవర్ధన్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయటం చర్చనీయాంశంగా మారింది.

మాజీమంత్రి పేర్ని నాని హౌస్ అరెస్టు..

వంశీ అరెస్టు నేపథ్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నానిని పోలీసులు గురువారం హౌస్ అరెస్టు చేశారు. తెల్లవారుజామున ఆయన ఇంటి వద్దకు పోలీసులు భారీగా చేరుకుని బయటికెళ్లేందుకు వీల్లేదని నోటీసులిచ్చారు.

తప్పుడు కేసులతో వంశీపై కక్షసాధింపు



వల్లభనేని వంశీపై పోలీసులు బనాయించిన తప్పుడు కేసును తక్షణం ఉపసంహరించుకోవాలి. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పోలీసులను పావుగా వాడుకుని వంశీపై తీవ్ర సెక్షన్లతో కేసులు నమోదుచేశారు. రాష్ట్రంలో చట్టాలను ఎలా తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారో వంశీ అరెస్టు ఉదంతం ఒక నిదర్శనం. అధికారం శాశ్వతం కాదని పోలీసులు గుర్తించాలి.

– మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే

అరెస్టు చేయొద్దని కోర్టు చెప్పినా..



వల్లభనేని వంశీని అరెస్టు చెయ్యొద్దని కోర్టు ఆదేశాలున్నా, పోలీసులు వాటిని ధిక్కరించి మరీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారం చేతిలో ఉంటే ఏం చేసినా చెల్లుబాటవుతుందనే పిచ్చి భ్రమల్లో నుంచి కూటమి నాయకులు బయటకు రావాలి. నియంత పాలన ఎంతోకాలం సాగదు. అన్యాయం జరిగిందని న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే, బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్న దౌర్భాగ్య పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి.

– జూపూడి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తప్పుడు ఫిర్యాదు చేయించి..



ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే పాలన సాగుతోంది. వంశీపై రాజకీయ కక్ష సాధింపులకే పోలీసులను ప్రయోగించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. వంశీ కేసు పూర్తిగా నీరుగారిపోతోందని చంద్రబాబు, లోకేశ్ కక్షపూరితంగా సత్యవర్ధన్ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి వారితో తప్పుడు ఫిర్యాదు చేయించారు. ఇలాంటి దుర్మార్గ విధానాలకు ప్రభుత్వ పెద్దలే పాల్పడుతుంటే ఈ రాష్ట్రంలో ఎవరికైనా న్యాయం జరుగుతుందా?

– వేల్పుల రవికుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ఎఫ్ఐఆర్ అడిగితే ఇవ్వడంలేదు..



నా భర్తపై నమోదుచేసిన కేసు ఎఫ్ఐఆర్ అడిగితే ఇవ్వడంలేదు. ఎందుకు అరెస్టు చేశారో చెప్పడంలేదు. రిమాండుకు తీసుకెళ్లినప్పుడు ఇస్తామంటున్నారు. ఎఫ్ఐఆర్ లేకపోతే లీగల్‌గా వెళ్లడానికి అవకాశం ఉండకూడదని ఇలా చేస్తున్నారు. హైదరాబాద్‌లో మా ఇంటికొచ్చి అరెస్టుచేశారు. నోటీసు ఇవ్వకుండా ఎందుకు అరెస్టుచేస్తున్నారని ప్రశ్నిస్తే అప్పటికప్పుడు పేపర్‌పై రాసిచ్చారు. అక్రమ కేసులో ఇరికించేందుకే ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వస్తుంటే తెలంగాణ సరిహద్దుల వద్దే ఏపీ పోలీసులు నన్ను అడ్డుకున్నారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్మోహనరావు సహాయంతో ఇక్కడకు చేరుకున్నాను.

– పంకజశ్రీ, వంశీ సతీమణి

చంద్రబాబు ఒత్తిడితోనే వంశీ అక్రమ అరెస్టు

మాజీ మంత్రి అంబటి



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ఒత్తిడితోనే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. వంశీ అక్రమ అరెస్టు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిపై తప్పుడు కేసులపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కలిసి వినతి పత్రాలు ఇచ్చేందుకు అంబటి రాంబాబు, మాజీ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులతో కూడిన వైఎస్సార్‌సీపీ బృందం గురువారం అపాయింట్‌మెంట్ తీసుకుని డీజీపీ కార్యాలయానికి వెళ్లింది. అయినా డీజీపీ కలవలేదు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీపై ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ తాను ఆ ఫిర్యాదు చేయలేదని, సాక్షి సంతకం తీసుకొని, దానితో వంశీపై తప్పుడు ఫిర్యాదు నమోదు చేశారంటూ మేజిస్ట్రేట్ వద్ద వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. దీంతో చంద్రబాబు, లోకేశ్ కుతంత్రాలు బట్టబయలయ్యాయని చెప్పారు. సత్యవర్ధన్‌ను వంశీ కిడ్నాప్ చేసి, బెదిరించి తప్పుడు వాంగ్మూలం ఇప్పించారంటూ అతని సోదరుడితో ఫిర్యాదు చేయించారని తెలిపారు. వంశీని పోలీసులు క్షణాల్లో అరెస్ట్ చేశారన్నారు. బుధవారం ఓ వివాహ వేడుకలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసిన రచ్చలో మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పైనా తప్పుడు కేసులు పెట్టారని తెలిపారు.

ఇష్టారాజ్యంగా అక్రమ కేసులు

- వల్లభనేని వంశీ అరెస్టుని ఖండిస్తున్నాం
- 'మండలి' విపక్ష నేత బొత్స సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: విపక్షంపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అక్రమంగా అరెస్టుచేశారని, ఈ అరెస్టును వైఎస్సార్‌సీపీ పూర్తిగా ఖండిస్తున్నట్లు ఏపీ శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. పాలన చేతకాక, హామీలు అమలుచేయలేక వైఎస్సార్‌సీపీ నాయకులపై ఇష్టారాజ్యంగా అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం తప్ప ఈ ప్రభుత్వం సాధించింది శూన్యమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం కారణంగా పోలీస్ వ్యవస్థను కోర్టులతో చీవాట్లు పెట్టిస్తున్నారని.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడునెలలైనా ఇప్పటివరకూ పాలన గాడిలో పడలేదని, అన్నింటికీ వైఎస్సార్‌సీపీని నిందించడం పరిపాటిగా మారిందన్నారు. ఫ్రీహోల్డ్ భూముల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన కూటమి నాయకులు, దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని బొత్స గురువారం విశాఖలో మీడియా సమావేశంలో సవాల్ చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఒక్కో డిపార్ట్‌మెంట్‌లో ఏడు వేల నుంచి 10 వేల ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని స్వయంగా చంద్రబాబే చెబుతున్నారు. అధికారులకు, మంత్రులకు సమన్వయంలేదని ఆయన మాటలతో స్పష్టంగా అర్థమవుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా చంద్రబాబు ఇంకా పాలన గాడిలో పెట్టలేకపోయారు. అప్పులు తేవడం గురించి వార్తలు కనిపిస్తున్నాయే తప్ప.. అభివృద్ధి ఎక్కడా కనిపించడంలేదు. రకరకాల పన్నులు, విద్యుత్ చార్జీల పెంపు రూపంలో ప్రజల మీద భారం మోపుతున్నారు. వీటికి ధరల దరువు అదనం. మా ప్రభుత్వంలో విద్యా రంగానికి ఎంతో మేలుచేసినా విషప్రచారం చేశారు. కానీ, ఇంగ్లిష్ భాష మీద పట్టున్న వారికే ఉన్నతోద్యోగాలు దక్కుతున్నాయని నీతి ఆయోగ్ స్పష్టంచేసింది. మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు.

ఆందోళన అక్కర్లేదు

మనుషులకు అత్యంత అరుదుగా బర్డ్ ఫ్లూ.. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎవరికీ సోకలేదు

జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కోళ్లకు ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా (హెచ్5ఎన్1–బర్డ్ ఫ్లూ) వేగంగా సోకుతోంది. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకిందనే వార్త గురువారం కలకలం రేపింది. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇప్పటి వరకు మనుషులకు బర్డ్ ఫ్లూ నమోదైన ఘటనలు చోటు చేసుకోలేదని వైద్య శాఖ స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. పక్షుల నుంచి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశం అత్యంత అరుదుగా ఉంటుందని స్పష్టం చేశారు. వ్యాధి బారినపడిన పక్షులకు దగ్గరగా ఉండే వ్యక్తులకు అరుదుగా ఈ వైరస్ సోకే అవకాశం ఉంటుందని, మనుషుల నుంచి మనుషులకు సోకిన సందర్భాలు లేవన్నారు. ఇక మనుషుల్లో బర్డ్ ఫ్లూ ఔట్ బ్రేక్స్ ఇప్పటి వరకూ సంభవించలేదని తెలిపారు. మనుషులకు వ్యాధి సోకినట్టైతే జ్వరం, దగ్గు, గొంతు మంట, ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు వస్తాయన్నారు. ఈ వ్యాధి నుంచి రక్షణ కోసం పౌల్ట్రీ ఉత్పత్తులను బాగా ఉడికించిన తర్వాతే ఆహారంగా తీసుకోవాలని, వ్యాధి బారినపడిన కోళ్లు, జంతువులకు దూరంగా ఉండాలని వైద్య శాఖ సూచిస్తోంది. ఈ తరహా కేసులు వ్యక్తుల్లో ఇప్పటి వరకు రాష్ట్రంలో వెలుగు చూడలేదు. గత పదేళ్లలో దేశ వ్యాప్తంగా రెండు హెచ్5ఎన్1, రెండు హెచ్9ఎన్2 కేసులు వెలుగు చూశాయి. 2019లో మహారాష్ట్రలో ఒకటి, 2021 జూలైలో హర్యానాలో ఒకటి, గతేడాది ఏప్రిల్, మే నెలల్లో పశ్చిమ బెంగాల్‌లో ఒక్కొక్కటి చొప్పున రెండు కేసులు నమోదయ్యాయి. 2003 నుంచి 2023 వరకు పశ్చిమ పసిఫిక్‌లో 248 కేసులు నమోదయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాదిలో 60 కేసులు నమోదైనట్లు వెల్లడైంది. కర్నూలు జిల్లాలో 15 బాతులు మృతి చెందగా..వాటికి బర్డ్ ఫ్లూ లేదని అధికారులు నిర్ధారించారు. తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్ల మృత్యువాత పడ్డాయి. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆయా జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లో పని చేసే సిబ్బందిని వైద్య శాఖ స్క్రీనింగ్ చేస్తోంది. బుధవారం నాటికి 584 మందిని స్క్రీనింగ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 18 మంది నుంచి నమూనాలు సేకరించి కాకినాడ రంగరాయ కళాశాలలో పరీక్షించగా నెగిటివ్‌గా నిర్ధారణ అయింది. మరోవైపు విజయవాడ, కర్నూలు, విశాఖ బోధనాస్పత్రుల్లో 10 పడకల ఐసోలేషన్ వార్డులను అందుబాటులో ఉంచారు.



మార్గదర్శకాలు పాటించాలి

రాష్ట్రంలో రెండు మూడు జిల్లాల్లో కోళ్లకు వ్యాపించిన బర్డ్ ఫ్లూ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. గురువారం ఆయన రాష్ట్ర సచివాలయం నుంచి పశు సంవర్థక, వైద్య ఆరోగ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చనిపోయిన కోళ్లను సక్రమంగా పూడ్చి పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కలెక్టర్లు, పశు సంవర్థక శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా స్టాండర్డ్ ప్రొటోకాల్ మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని పాటించాలన్నారు. వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటరు పరిధిని రెడ్ జోన్‌గా ప్రకటించి, అక్కడికి రాకపోకలను, దాణా రవాణాను నియంత్రించాలని స్పష్టం చేశారు. ఒకటి నుంచి తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ముందు జాగ్రత్తలు చేపట్టాలని, పశు సంవర్థక శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రసార మాధ్యమాల్లో ఏవైనా తప్పుడు వార్తలు వస్తే ఆందోళన చెందొద్దని, అలాంటి వార్తలు ప్రసారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బర్డ్ ఫ్లూ సోకిన ఏలూరు జిల్లా బాదంపూడి, పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరు, కానూరు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లోని 5 ఫార్మ్‌ల్లో చేపట్టిన చర్యలపై ఆయన ఆరా తీశారు. ఢిల్లీ నుండి కేంద్ర పశు సంవర్థక శాఖ కమిషనర్ డా.అమిత్ మిత్రా మాట్లాడుతూ సరే కోళ్ల ఫారాలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలని చెప్పారు. కాగా, ఏలూరు జిల్లా బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ వల్ల ఎవరూ మరణించలేదని కలెక్టర్ ప్రకటించారు.

రాష్ట్రానికి కేంద్ర బృందాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ తీవ్రతపై అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు వచ్చాయని మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర పశు సంవర్థక శాఖ జాయింట్ సెక్రటరీ కూడా శుక్రవారం రాష్ట్రానికి వస్తారని చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు.